## విద్యతోనే ఉన్నత శిఖరాలు

### పాఠశాల తనిఖీలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

కూసుమంచి, డిసెంబర్ 13: క్రమశిక్షణతో కూడిన చదువుతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని డీఈవో సోమశేఖశర్మ అన్నారు. కూసుమంచి ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల హాజరు, ఉపాధ్యాయుల బోధనను వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, రోజూ పాఠశాలకు రావాలన్నారు. నూరుశాతం లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముత్తారం రాములోరి సన్నిధిలో కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవంలో మహిళలు

ముదిగొండ, డిసెంబర్ 13: మండలంలోని ముత్తారం సీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేసేందుకు ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేయగా వందలాది మంది భక్తులు పాల్గొని దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు బొర్ర వాసుదేవాచార్యులు, యతి వందనం చేసి, స్వాగతం, సందర్భ పరిచయంతో పాటు దీప ప్రాశస్త్యాన్ని, కార్తీక మాసంలో దీపారాధన యొక్క ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు, హర్షాచార్యులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

చింతకాని, డిసెంబర్ 13: దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు అన్నారు. మండలంలోని లచ్చగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫిజియోథెరపీ డాక్టర్ వసంత ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ గురజాల ఝాన్సీతో కలిసి పరిశీలించారు. ప్రతి బుధవారం జరిగే ఈ కార్యక్రమాన్ని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగ పరచుకోవాలని వారు కోరారు. ఐఈఆర్పీలు కృష్ణారావు, దస్లీ, హెచ్ఎం మహ్మద్‌హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన మండల నాయకులు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 13: ఇటీవల రాష్ట రెవెన్యూ, హౌజింగ్, సమాచారశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి స్వగృహంలో మండల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వెంపటి రవి, వేమన శ్రీనివాసరావు, రెడ్యానాయక్, కొక్కు రాజు, కొంక స్వరూప్ తదితరులున్నారు.

## బీఆర్ఎస్ కార్యాలయంలో చోరీ

మధిర, డిసెంబర్ 13: బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు పల్లపోతుల వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి కార్యాలయం వెనుక భాగం నుంచి తలుపులు పగులగొట్టి టీవీతో పాటు, ఇన్వర్టర్ బ్యాటరీ చోరీ చేసినట్లు వారు పేర్కొన్నారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## కృష్ణాపురం వాసికి బెస్ట్ సైంటిస్ట్ అవార్డు

మధిరరూరల్, డిసెంబర్13: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన డాక్టర్ గుజ్జు గాంధీకి అవుట్ స్టాండింగ్స్ రీసెర్చ్ ఇన్ మలేరియా మెడికల్ ఎంటోమాలజీ 2023 ఇండియా ఫ్రం కాలికట్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ వారు బుధవారం ది బెస్ట్ యంగ్ సైంటిస్ట్ అవార్డును అందజేశారు. గుజ్జు గాంధీకి అవార్డు రావడం పట్ల గ్రామస్తులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 13 : నిత్యం బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్)కు చెందిన జమ్ముల రాజశేఖర్‌ను అదే ప్రాంతానికి చెందిన ఆనంద్ గత కొద్దిరోజులుగా వేధింపులకు గురిచేస్తూ చంపుతానని బెదిరిస్తూ ఉన్నాడు. బెదిరింపులకు తట్టుకోలేక రాజశేఖర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆనంద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా విద్యాబోధన సాగాలి



తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిక్షిస్తున్న రాష్ట్రస్థాయి బృందం సభ్యులు

కూసుమంచి, డిసెంబర్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా విద్యాబోధన సాగాలని రాష్ట్ర విద్యా పరిశీలకులు రమేశ్‌రావు, అనీల్, మూర్తి సీతారామశాస్త్రి అన్నారు. కూసుమంచిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం వారు విద్యాబోధనపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలని, అందుకు తగిన విధంగా వారిని తయారు చేయాలని కోరారు. 8,9 తరగతులకు చెందిన తెలుగు, అంగ్ల వంటి సబ్జెక్టుల్లో బోధన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతం కంటే అనేక రకాలుగా వసతులు, వనరులు మెరుగుపడ్డాయని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలని, అప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బీవీ రామాచారి, స్పెషల్ ఆఫీసర్ అజిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

**తొలిమెట్టు ప్రోగ్రాం పరిశీలించిన రాష్ట్ర బృందం**

తిరుమలాయపాలెం, డిసెంబర్ 13: తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బుధవారం రాష్ట్రస్థాయి అధికారుల బృందం సందర్శించింది. ఆయా పాఠశాలల్లో తొలిమెట్టు, ఉన్నతి ప్రోగ్రామ్ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారుల బృందం సభ్యులు రమేష్‌రావు, మూర్తి, సీతారామారావు, అనీల్‌కుమార్, ఎంఈవో బీవీ రామాచారీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



సాయికృష్ణమాచార్యులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధిర రూరల్, డిసెంబర్ 13: మాటూరు కాంప్లెక్స్ పరిధిలోని మాటూరు ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం చెరుకూరి శ్రీహరి అధ్యక్షతన బుధవారం 2023-24 విద్యా సంవత్సరానికి మొదటి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశలో ఎంఈవో వై.ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని, ఉపాధ్యాయులందరూ ఆ లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 5 సంవత్సరాలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా సేవలందిస్తున్న దీవి సాయికృష్ణమాచార్యులను సన్మానించారు. సమావేశంలో పూర్వ కాంప్లెక్స్ హెచ్ఎం సాయికృష్ణమాచార్యులు, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ సంగు కృష్ణాంజనేయులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

## అవయవదానానికి అంగీకారం

మధిర, డిసెంబర్ 13: తాను ఏదో రకంగా ఉపయోగపడాలన్న సంకల్పంతో ఒక మహిళ ముందుకొచ్చి తన శరీరాన్ని మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు ముందుకొచ్చి అంగీకార పత్రాన్ని మమత మెడికల్ కళాశాలకు బుధవారం అందజేశారు. మధిర పట్టణానికి చెందిన ఆర్టీసీ కండక్టర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నామాల పద్మావతి మమత మెడికల్ కళాశాలకు తన మరణానంతరం శరీరాన్ని దానం చేసేందుకు అంగీకరిస్తున్నట్లు అగ్రిమెంట్ పత్రాన్ని అందజేశారు. మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, జల్లా శ్రీనివాసరావు, డాక్టర్ ఉదయ్, డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి సరుకుల పంపిణీ



సరుకులు, సాయం అందిస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 13: కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి కుటుంబానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిఫ్(ఎస్‌జీఎఫ్) సభ్యులు అండగా నిలిచారు. పట్టణంలోని కూలీలైన్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సమద్ తోపుడుబండిపై అరటిపండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా కిడ్నీ, లివర్, ఊపరితిత్తుల సమస్యతో బాధపడుతుండడంతో జీవనోపాధి లేక కుటుంబం గడవడం కష్టంగా మారింది. మెరుగైన వైద్యం చేయించుకునే స్థోమత లేక మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు బుధవారం సమద్‌ను పరామర్శించి, నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం అందించి ధైర్యం చెప్పారు. ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాసీం, కోశాధికారి చిట్టిమల్ల బ్రహ్మాచారి, అబ్దుల్ నజీర్ అహ్మద్, డింపుల్ శర్మ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లం ఉమ

ఖమ్మం రూరల్, డిసెంబర్ 13: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బెల్లం ఉమ అన్నారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను అధికారుల ముందు ప్రదర్శించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వైన్‌షాపును రోడ్ సమీపం నుంచి ఇతర ప్రదేశానికి తరలించాలని సభ్యులు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో రవిందర్‌రెడ్డి, ఎంపీవో రాజారావు, ఎంఈవో శ్యాంసన్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు..



బయ్యర్‌తో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ వెంకటకృష్ణ

మధిర, డిసెంబర్ 13: రైతులకు ఇబ్బందులు కలిగించకుండా పత్తి కాంటా వేయాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు అన్నారు. దెందుకూరు సమీపంలో కనకదుర్గా కాటన్‌మిల్ వద్ద సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సీసీఐ నందు పత్తి కాంటాను సరైన సమయంలో వేయడం లేదని, తరుగు అధికంగా తీస్తున్నారని బుధవారం రైతులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, దెందుకూరు సొసైటీ అధ్యక్షుడు కోట వెంకటకృష్ణ రైతుల సమస్యలపై బయ్యార్ శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని, తేమశాతం ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిని తిరిగి పంపకుండా ఎక్కువ తరుగు తీయకుండా రైతులకు సహకరించాలని కోరారు. విషయంపై బయ్యార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులను నష్టపెట్టేలా కాటాలో తరుగులు తీయడం లేదని, రైతులు ఒక్కసారిగా కాటాలు వేయాలని ఆందోళన చేస్తున్నారని, రైతులు సహకరిస్తే పత్తిని ఆలస్యమైనప్పటికీ కాటాలు వేస్తామని, కాటా వేయించుకొని బిల్లులు చేయించుకోవాలని కోరారు.

## రెండో రోజుకు చేరిన తపాలా ఉద్యోగుల సమ్మె



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

మధిరరూరల్, డిసెంబర్ 13: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మధిర సబ్ పోస్టాఫీసు ఎదురుగా గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీణ తపాలా సంఘం ఖమ్మం జిల్లా నాయకులు రావూరి రామారావు, బ్రాంచ్ సెక్రటరీ మువ్వా రామకృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగులను బానిసలుగా చూస్తున్నారని, వెట్టిచాకిరి చేయిస్తున్నారని, ఇంతవరకు పర్మినెంట్ చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గ్రామీణ తపాలా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తెలిపారు. ఎస్.కే.పాషా, ఏడుకొండలు, జానయ్య, బిక్కి వెంకటేశ్వర్లు, శ్రీను, శివ పాల్గొన్నారు.

పాల్వంచ, డిసెంబర్ 13 : మండలంలోని 27 పోస్టాఫీస్‌ల్లో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు, సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. బుధవారం పాల్వంచలోని హెడ్ పోస్టాఫీస్ ఎదురుగా టెంట్ ఏర్పాటు చేసి దీక్షను ప్రారంభించారు. 2016లో కామేలేష్ చంద్ర కమి టీ చేసిన న్యాయమైన సిఫార్సుల సాధన కోసం సమ్మె చేస్తున్నారు. ఎల్లారావు, భూషణం, సిద్దయ్య, శ్రీను, తరుణ్, మంజు, అనీత, వీరేందర్, నితిన్, భవాని శంకర్, కారుణ్య, సరిత, నందిని, అనుక్, ప్రమోద్ రాజా, ఫరీదా పాల్గొన్నారు.

**రెండోరోజు కొనసాగిన నిరసన**

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 13 : కొత్తగూడెంలో జరిగిన తపాలా ఉద్యోగుల సమ్మెలో రెండో రోజు జయరాజు, ఖాన్, వెంకటేశ్వర్లు, వాహబ్, షేక్ ఖలీల్, వెంకట కృష్ణ, వినయ్, సుధీర్, శ్రీను, లక్ష్మీభారతి, సాహిత్య, రిజ్వాన పాల్గొన్నారు.